# మహత్తర సత్యం




2005 క్రేన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

చోడిశెట్టి
శ్రీనివాసరావు

"మీరు తొమ్మిది గంటలకే బయలుదేరాలని చెప్పారు సార్! కారు సిద్ధంగా ఉంది" అన్నాడు మేడమీది కొచ్చి అమరనాథ్

"వచ్చేస్తున్నాం అమర్! నువ్వుపద" అంటూ లోపలున్న భార్యను పెద్దగొంతుతో పిలిచారు దయాసాగర్

కొంతసేపటి తర్వాత కుమార్తె శ్రీవల్లితో అక్కడి కొచ్చారు పద్మావతి

"తొందరగా వెళ్ళాలని చెబితే ఇంత ఆలస్యమా?" అసహనంగా అన్నారు దయాసాగర్

"అమ్మాయి గొడవ చేస్తోందండీ!" చెప్పారు పద్మావతి

"గొడవా! ఎందుకట?" ఆశ్చర్యంగా కుమార్తె మొహంలోకి చూశారు దయాసాగర్

శ్రీవల్లి మాట్లాడలేదు

"ఏమిటో చెప్పమ్మా! అక్కడ దీన జనోద్ధరణ సంఘానికి సంబంధించిన వారంతా నాకోసం ఎదురు చూస్తుంటారు" అన్నారు దయాసాగర్.

"అదే డాడీ! ఈ రోజు ఫ్రెండ్స్‌తో పిక్నిక్ ప్రోగ్రాం ఉందనీ, సరిగ్గా పదిన్నరకు మాధురిమేడమ్ ఇంటివద్దనుంచి మేమంతా బయలు దేరాలనీ నిన్ననే మీకు చెప్పాను అయినా మీకారు ఎవరికో ఎరువిచ్చి నాకారు తీసుకెళుతున్నారు; నేనేమో కారుతెస్తానని వాళ్ళకు మాటిచ్చాను!" అంది కోపంగా శ్రీవల్లి.

"పెద్దవాళ్ళడిగితే కాదని ఎలా అనగలం చెప్పమ్మా?"

"ఔన్లెండి, నాకన్నా ఆ పెద్ద వాళ్ళే ముఖ్యం మీకు" అంది చిన్నబోయిన ముఖంతో శ్రీవల్లి

"ఏంటోనమ్మా, కొన్ని విషయాలు నీకు చెప్పినా అర్థంకావు- ఈ వాదన దేనికి గాని ఇప్పుడు సమయం తొమ్మిదింబావయింది... పదయ్యేసరికి కారులో అమర్ ఇక్కడుంటాడు సరేనా!"

"సరేడాడీ! కారు పంపకపోతే ఆ తర్వాత ఏమవుతుందో..."

"నాకు తెలుసులే అమ్మా! నువ్వు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టనంటావు.... అంతేగా, ఆ పరిస్థితి రాదులే" అని చిన్నగా నవ్వి భార్యతో సహా గబగబా కిందికొచ్చారు దయాసాగర్.

వారిని చూస్తూనే అమరనాథ్ కారుడోర్ తెరిచి పట్టుకున్నాడు. కారులో కూర్చొని ఎక్కడికెళ్ళాలో చెప్పారాయన. మరుక్షణం కారును ముందుకురికించాడు అమరనాథ్.

దయాసాగర్ కుటుంబమంతా కూర్చొని తిన్నా తరగని ఆస్తిని ఆయన పెద్దలు సంపాదించి పెట్టి వెళ్ళిపోయారు. అలాగని ఆయన చేతులు ముడుచుకొని కూర్చోలేదు అనేకరకాల వ్యాపారాలు చేసి ఆ ఆస్తిని మరింత వృద్ధి చేశారు. డబ్బు బాగా గడించగానే పదిమందిలో తనకో ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న తపన మొదలైందాయనకు. ఓ అనాధను చదివించడమోలేదా ఓ పేదింటి ఆడపిల్లపెళ్ళికి

## నానీలు

ఇళ్ళంతా చీకటి
కరెంటు కోతా?
కాదేమో ?
ఇంటిదీపం ఊరెళ్ళింది -

వీధి వీధంతా దుర్గంధం
మునిసిపాలిటీ పడకేసిందా?
కాదు.... కాదు
రాజకీయ సభ జరుగుతోంది -

ఆకాశం ఏడుస్తోంది
అకాల వర్షమా ?
కాదనుకుంటా...
వీరుడు ఉరితీయబడ్డాడు -

తోటలో కోయిల గానం
మారాకు లేకుండానే
వసంతం వచ్చిందా?
పిల్లలు చెట్లల్ల చేరారు -

**- డా॥ కాసుల లింగారెడ్డి**

సహాయపడటంలాంటివి చేస్తే బాగుంటుందన్నారు పద్మావతి. భార్య మాటలు ఆయనకు నచ్చలేదు. అదేపనిగా ఆలోచించి, ఆలోచించి చివరికి దీనజనోద్ధరణ సంఘం స్థాపించాలన్న నిశ్చయానికొచ్చారు అయితే అది ఒక్కరితో అయ్యేపని కాదు గనుక మిత్రులైన కొంతమంది సంపన్నులను ఇంటికి ఆహ్వానించి తన ఆలోచనను వారి ముందుంచారు

"మీకిలాంటి మతిలేని ఆలోచన కలిగిందేమిటి?" అన్నారు దయాసాగర్‌గారిని మందలిస్తూ వారిలో కొందరు.

"మనదేశ జనాభాలో సగానికిపైగా దీనులు-దరిద్రనారాయణులే ఉన్నారు. వీళ్ళందరినీ మనమెక్కడ ఉద్ధరించగలమండీ బాబూ!?"అన్నారు భయపడిపోతూ ఇంకొందరు.

"అసలుదీనజనావళంటూ లేకపోతే మనకీ, మన రాజకీయనాయకులకీ ఎంత మాత్రం మంచిది కాదు!" అన్నారు ముందుచూపుగల మరికొందరు.

'గురువు రాజకీయాల్లోకి దిగే ఉద్దేశంలో ఉన్నట్టున్నాడు; అందుకే దీనజనోద్ధరణ సంఘం పేరిట చక్కని వల పన్నుతున్నాడు' అనుకున్నారు అంతమందిలోనూ ఒకరిద్దరు.,

మొత్తానికేమైతేనేం కొద్దిరోజుల తర్జన భర్జనల తర్వాత ఆ ఒక్కరో ఇద్దరో తప్ప మగిలిన వారంతా దీనజనోద్ధరణ సంఘం స్థాపించడానికంగీకరించారు. సంఘానికి అధ్యక్షునిగా దయాసాగర్‌గారే ఉండాలని తీర్మానించారు. రాజు తల్చుకొంటే దెబ్బలకు కొదవా అన్నట్టు అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ ఆగమేఘాలమీద జరిగిపోయినై.... సంఘం కార్యక్రమాలు నిర్వహించడానికి నగరానికి కాస్తదూరంలో సకల సదుపాయాలుగల భవనం ఒకటి అద్దెకు మాట్లాడారు. అది ప్రారంభించడానికి ఓరాజకీయనాయకుణ్ణి ఆహ్వానించారు.

ఆ ప్రారంభోత్సవ సంరంభం జరగబోతున్నదా రోజే......

-ఇరవై నిమిషాల్లో ఊరి చివరనున్న యస్.సి.కాలనీ దాటి దీనజనోద్ధరణ సంఘం కోసం తీసుకున్న భవనం వద్ద కారు ఆపుజేశాడు అమరనాథ్

దయాసాగర్ భార్యతోపాటు కార్లోంచి దిగి "అమర్, అమ్మాయికి కారు కావాలట. నువ్వు వెంటనే ఇంటికెళ్ళు, ఇక్కడి కార్యక్రమం పూర్తికాగానే క్షేమం ఎవరోఒకరి కారులో వచ్చేస్తాం!" అని ఒకటికి రెండుసార్లు చెప్పి లోపలకు నడిచారు.

అప్పటికే వచ్చి ఉన్న సంఘం సభ్యులు, తదితర పెద్దలంతా దయాసాగర్‌ని చూస్తూనే గౌరవపూర్వకంగా లేచి నిలబడ్డారు.... వారు తిరిగి కూర్చోకుండానే ప్రముఖ రాజకీయ నాయకుడు రాజేంద్ర రావడంతో అంతా ఆయనకెదురెళ్ళి సగౌరవంగా లోపలకు తోడ్కొని వచ్చారు.

"అనుకున్న సమయానికి అయిదు నిమిషాలు ముందే వచ్చిన మీకు-మా అందరి తరపునా కృతజ్ఞతాభివందనాలు!" అన్నారు

దయాసాగర్

"అంటే నేను అనుకున్న సమయాని కెప్పుడూ ఆలస్యంగా వస్తానని మీ అభిప్రాయమా!" అన్నారు చమత్కారంగా రాజేంద్ర.

ఆయన మాటలకు కొన్ని క్షణాలపాటు అక్కడ నవ్వుల పువ్వులు విరిశాయి

మరి కాస్సేపట్లో దీనజనోద్ధరణ సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమం దివ్యంగా జరిగి పోయింది. వెనువెంటనే పెద్దలంతా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభావేదిక మీదికి చేరారు. ముందుగా రాజేంద్ర మాట్లాడుతూ....

"నగరంలోని పెద్దలంతా కలిసి దీనుల నుద్ధరించేటందుకో సంఘాన్ని ఏర్పాటు చెయ్యడమే గాక-వ్యాపార రంగంలో ప్రముఖులైన శ్రీదయాసాగర్‌గారిని ఈ సంఘానికి అధ్యక్షునిగా ఎన్నుకోవడం ఎంతైనా ఆనందించదగ్గ విషయం! ఆయన పర్యవేక్షణలో ఈ సంఘంద్వారా దీనుల కన్ని విధాలా సహాయం లభిస్తుందని నాప్రగాఢ విశ్వాసం! నాకు మరో ప్రారంభోత్సవ కార్యక్రమం ఉన్నందున మీ అందరి వద్దా సెలవు తీసుకుంటున్నాను..." అంటూ వేదిక దిగి హడావిడిగా వెళ్ళిపోయారు రాజేంద్ర.

ఆ తర్వాత దయాసాగర్ మైకు ముందుకొచ్చి అందరికీ వందనాలు చెప్పి "ఈ సంఘం ద్వారా పేద పిల్లలకు పాలు సరఫరా చెయ్యడం, అనాధ బాలబాలికలకు వస్త్రదానం చెయ్యడం, వికలాంగులకు ఉపాధి కల్పించడం, కన్నవారి ఆదరణ కరువై కడుపుకింత తిండిలేక కుమిలిపోతున్న వృద్ధులను ఆదుకోవడం లాంటి కార్యక్రమాలెన్నింటినో చెయ్యాలని అనుకుంటున్నాం. ఇవన్నీ నిర్వహించడానికి మీరంతా ఆర్థిక సహాయం చెయ్యక తప్పదు. అప్పుడే ఇది దీనులపాలిట కల్పతరువుగా రూపొందుతుంది. కాబట్టి మిత్రులారా! మానవ జన్మ పరమార్థాన్నీ, దీనులసేవే దేవుడి సేవన్న నిజాన్నీ గ్రహించి ఇందుకు సహకరించవలసిందిగా మీ అందరికీ సవినయంగా మనవి చేస్తున్నాను...." అంటున్న దయాసాగర్ మాటలు పూర్తి కాకుండానే అక్కడ చప్పట్లు మారుమోగినై.....దీనులపాలిటి దేవుడు దయాసాగర్ గారికి జై....దీనబంధుకిజై... అన్న నినాదాలు మిన్ను ముట్టినై...మేము అంతిస్తాం.. ఇంతిస్తాం అన్నవాగ్దానాలు వర్షంలా కురిసినై....

మరో ముప్పావుగంటకు ఆ కార్యక్రమం పూర్తయింది. పారిశ్రామికవేత్త వెంకటాచలంగారు దయాసాగర్ దంపతులను ఇంటి వద్ద దిగబెట్టి వెళ్ళిపోయారు.

మేడమీదికొస్తూనే తెరచి వున్న తలుపులను, కాలుగాలిన పిల్లిలా గదిలో తిరుగుతున్న కుమార్తెను చూసి నివ్వెరపోతూ "నువ్వు విహారయాత్ర కెళ్ళలేదా వల్లీ?"

అన్నారు దయాసాగర్

"చాల్లెండి.... తప్పని సరిగా వెళ్ళాలని చెబితే మొత్తానికి కారు పంపించడం మానేస్తారా!?" అంది మండి పడుతూ శ్రీవల్లి.

"అరె, మేం అక్కడకు చేరుకున్న వెంటనే డ్రైవర్‌ని ఇంటికెళ్ళమని చెప్పానే!"

"అవునమ్మా! అమర్ రాలేదా?" ఒకింత ఆశ్చర్యంతో అన్నారు పద్మావతి.

"వస్తే నేనెందుకిక్కడ ఉంటాను?"

"చాలా విచిత్రంగా వుందే! రానీ అతడి సంగతి తేలుస్తాను" దయాసాగర్‌గారి ముఖం కోపంతో ఎరుపెక్కింది

ఇంతలో ఇంటి ముందు కారాగింది.

అమరనాథ్ భయపడుతూ మేడ మీది కొచ్చాడు. నిప్పులు కురిపించడానికి సిద్ధంగా ఉన్న అమ్మగారిని, అయ్యగారిని చూసి మరింత భయపడిపోతూ "సార్!.. సార్!...." అన్నాడు వణికే గొంతుతో.

"నీకసలు బుద్ధుందా!..నేను అమ్మాయికి కారు అవసరమని మరీ మరీ చెప్పి పంపిస్తే ఇప్పుడొస్తావా..ఇంతవరకూ ఎక్కడున్నావ్?" విరుచుకుపడ్డారు దయాసాగర్

"అదే సార్!... మరి... మరీ..."

"మరీ లేదు- మన్నూలేదు. నిన్ను ఉద్యోగంలోంచి తీసేస్తున్నాను! ఇదిగో నీకు రావాల్సిన జీతం...."

"సార్..సార్..పది సంవత్సరాలనుంచి మీ వద్ద పని చేస్తున్నాను. నేను చెప్పేది కాస్త..."

"నీ కట్టుకథలేవీ నేను వినదలుచుకోలేదు.నా కళ్ళముందు నుంచి తక్షణం వెళ్ళిపో!"

అరిచారు దయాసాగర్.


అమరనాథ్ కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి. జీతం తీసుకోకుండానే దీనంగా వారి వైపు చూసి వెళ్ళిపోబోతూంటే- "అమర్ నువ్వెప్పుడూ ఇలా చెయ్యలేదు. ఇప్పుడెందుకిలా చేశావు? ఏదైనా జరిగి ఉంటే అమ్మాయికి ఫోన్ చెయ్యొచ్చుగా!" అన్నారు ప్రసన్నవదనంతో పద్మావతి.

శ్రీవల్లి, దయాసాగర్ తీక్షణంగా పద్మావతి గారి వైపు చూశారు.

"కంగారులో ఫోన్ చెయ్యాలన్న సంగతి తోచలేదమ్మగారూ!" తలొంచుకొని అన్నాడు అమరనాథ్

"నువ్వంత కంగారు పడాల్సిన పనేమొచ్చింది?...ఫర్వాలేదు అమర్,జరిగిందేమిటో చెప్పు!" అన్నారు అభయమిస్తున్నట్టుగా పద్మావతి.

"అమ్మగారూ! నేను మిమ్మల్ని దిగబెట్టి వచ్చేస్తూంటే యస్.సి. కాలనీ వద్ద ఒక ముసలామె హఠాత్తుగా కారుకి అడ్డంగా వచ్చింది... సడెన్ బ్రేక్ వేసి కారు ఆమెకు తగల కుండా ఆపగలిగాను. అయినా ఆమె రోడ్డు మీద పడిపోయింది. దారిన పోతున్న వాళ్ళెవరూ పట్టించుకోలేదు. నేను కారు దిగి చూస్తే ఊపిరాడుతోంది కాని మాట్లాడలేకపోతోంది. కార్లో సీసాలో ఉన్న మంచినీళ్ళు తెచ్చి ఆమె ముఖం మీద కొట్టి - కొన్ని నీళ్ళు తాగించాను. కాస్సేపటికి తేరుకొని 'ఆకలి...



ఆకలి...' అంటూ కడుపు చూపించి, రెండు చేతులూ జోడించింది. దగ్గర్లోని భోజన హోటల్‌కి తీసికెళ్ళి భోజనం పెట్టించాను.... నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుర్లున్నా ఆమెనెవరూ పట్టించుకోక పోవడంతో ఇక్కడున్న శ్రావణి వృద్ధాశ్రమంలో చేరదామని వచ్చిందట; దగ్గరున్న కొంత డబ్బుతోపాటు చిరునామా కూడా ఎవరో అపహరించడంతో నిన్నటి నుంచీ తిరుగుతున్నా వృద్ధాశ్రమం ఎక్కడున్నదీ ఎవరూ సరిగ్గా చెప్పలేదట; దాంట్లో బాగా తెలిసిన వాళ్ళున్నారనీ, తనను అక్కడకు చేర్చి పుణ్యం కట్టుకోమని ఒక్కలా ప్రాధేయపడితే ఆ ముసలామెను వృద్ధాశ్రమం వద్ద దించి వచ్చాను...."

"ఏమిటీ... ఎవరో తెలియని- చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న ముసలి దాన్ని కారెక్కించుకొని వృద్ధాశ్రమానికి తీసికెళ్ళావా! దారిలో ఆ ముసలిది చనిపోయివుంటే- ఓ నీకెంత ధైర్యం? నిన్ను... నిన్ను...."

"ఆగండి!" అమరనాథ్ మీద చెయ్యి చేసుకోబోతున్న భర్తను వారించి-"అమర్! ఆయన కోపంతో అన్నమాటలు పట్టించుకోక వెళ్ళి నీపని చూసుకో!" అన్నారు శాంత స్వరంతో పద్మావతి.

"అమ్మాయిగారు బయటకు వెళ్ళరా అమ్మగారూ?"

కుమార్తె వైపు చూశారు పద్మావతి

"నేను రావడం లేదని ఇందాకనే మామేడమ్‌కి ఫోన్ చేసి చెప్పేశాను. వాళ్ళంతా ఎప్పుడో వెళ్లిపోయి ఉంటారు! కారు లోపల పెట్టు" అంది శ్రీవల్లి

అమరనాథ్ బటయకు నడిచాడు

"నేను పొమ్మన్న వాణ్ణి నువ్వు ఉండమనడమేమిటి? నీకు మతిపోయిందా పద్మా!" తీవ్ర స్వరంతో అన్నారు దయాసాగర్

"లేదండీ, నామతి సరిగ్గానే ఉంది. మీరే మతిలేకుండా మాట్లాతున్నారు... ఏం జరిగిందో తెలుసుకోకుండా ఆవేశపడుతున్నారు.. జరిగిందేమిటో తెలిశాక అది భరించలేక పోతున్నారు... మీ మాటలు ఆచరణ రూపం ధరించేసరికి బాధపడి పోతున్నారు అలాంటప్పుడు దీనులకోసం సంఘం పెట్టడం.. వేదికనెక్కి వాళ్ళ కేదో చేస్తామంటూ మాటలు చెప్పడం దేనికి? ఈ మాత్రం సహించలేని వారు- ఒక మంచిపనిని హర్షించలేని మీరు దీనులకేం సేవచేస్తారో నాకు అర్థం కాకుండా ఉంది?... అమర్ కారు డ్రైవరే కావచ్చు. కానీ మానవతా హృదయంతో ఆ ముసలామెను ఆదుకొని- వందమాటలు చెప్పడం కన్నా ఓ మంచిపని చెయ్యడం మిన్న అనే మహత్తర సత్యాన్ని తెలియజెప్పాడు. ప్రశాంత చిత్తంతో ఆలోచించండి.... ఈ సత్యం మీకూ బోధపడుతుంది!" అన్నారు చెమ్మగిల్లిన కళ్ళతో పద్మావతి.

సంభ్రమాశ్చర్యాలతో భార్యను చూస్తూ కొన్ని క్షణాలపాటు అలాగే ఉండి పోయారు దయాసాగర్.... ఆమె మాటలు ఆయన అంతరంగాన్ని పట్టికుదుప సాగాయి...

## సంస్కారం

పోస్టులో పుస్తకం వచ్చింది
నెమిలీకంత అందంగా వుంది
పంపించిన వాళ్ల మనసు
ఇంద్రధనుస్సై వుండాలి
మెత్తని కరచాలనంలా వచ్చింది
మనం వాళ్ల హృదయాల్లో వుండి వుంటాం
పుస్తకాల దొంతరలో
మనం కూడా మనం కూడా
మడతపెట్టిన పేజీయై వుండి వుంటాం
ఏదో పాత ఉత్తరంలోనో
రంగుల గ్రీటింగుకార్డు మీదనో
మెరుపు కాయితంలా అతుక్కొని వుండి వుంటాం
ఎప్పుడైనా కనిపించినపుడు
క్షణాల మధురాన్ని పంచుకొని వుండి వుంటాం
మన గురించి ఏ మిత్రుడైనా
నాలుగు కవితా వాఖ్యాల్లో చెప్పి వుండే వుంటాడు
ఎలాగైతేనేమీ పక్షి వచ్చి వాలినట్టు
పుస్తకం వచ్చింది
నెమ్మదిగా పుస్తకం తెరిస్తే
జీవితం కనిపించింది
రెండు చేతులు జోడించి నమస్కరించాను
ఎంత ప్రేమగా ముద్రించారో
పేజి పేజీకి తెలుస్తుంది
కన్నబిడ్డల పెళ్ళిళ్ళు చేసినంత సంబరంగా
ఇల్లు కట్టుకున్నంత శ్రద్ధగా
పుస్తకం అచ్చు వేశారు
అనుభవాల్ని సానబట్టి
ఆలోచనల్ని పుటంపెట్టి
ఈ నగను చేసి వుంటారు
కష్టపడి నేసిన వస్త్రం యిది
తలకు చుట్టుకొని
అద్దంలో మురిసిపోదాం
ఒకరు మనకు నమస్కరిస్తే
ప్రతి నమస్కారం చేయడం
మనిషికుండాల్సిన సంస్కారం
శ్రామికుడా !
నువ్వు చేసిన అక్షరాలకు
సాష్టాంగ నమస్కారం

- ఆశారాజు